


మన
# భానుపురి
ఇది సూర్యాపేట వార్తల ఉషాకిరణం




గురువారం 1 అక్టోబర్ 2026 ఎడిటర్ :- బచ్చు పురుషోత్తం పేజీలు :- 2

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ డ్యామేజ్ రోడ్ల మరమ్మత్తులను వెంటనే పూర్తి చేయాలి

భానుపురి /సూర్యాపేట ప్రతినిధి

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వలన డ్యామేజ్ అయిన రోడ్లకు వెంటనే మరమ్మత్తులు పూర్తి చేయించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం అయన మున్సిపల్ కమీషనర్ హనుమంత్ రెడ్డి తో కలిసి 14 వార్డు వినాయక నగర్, కృష్ణ నగర్ కాలనీ, వెంకటేశ్వర కాలనీ లలో రోడ్లను తనిఖీ చేశారు. వినాయక నగర్ మెయిన్ రోడ్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వలన డ్యామేజ్ అయిన రోడ్లను పరిశీలించి నాణ్యతతో త్వరితగతిన రోడ్లకు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. కృష్ణనగర్ కాలనీ పార్కును సందర్శించి పార్కు అభివృద్ధి గురించి మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ ఈఈ తో చర్చించారు. వార్డులో ఉన్న ఓపెన్



ప్లాట్లలో చెత్త పేరుకుపోయినందువలన వెంటనే అక్కడ చెత్తను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని వర్షాకాలం దోమలు వలన అంటువ్యాధులలు ప్రబలే అవకాశం ఉన్నందువలన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,



రోడ్లమీద నీళ్లు నిలువ ఉండకుండా చూడాలని, డ్రైనేజీ కాలువలలో పేరుకుపోయిన చెత్తను క్లీన్ చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ కిరణ్ కుమార్, పబ్లిక్ హెల్త్, డి ఈ రమాదేవి, ఎస్సీ



వెంకటేశ్వర్లు, ఏ ఇ అనిల్ వార్డ్ కౌన్సిలర్ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు

## హాజరు తగ్గితే చర్యలు తప్పవు






భానుపురి /సూర్యాపేట కలెక్టరేట్

విధులకు అలసత్వం వహించే ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ సెప్టెంబరు మాస సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లాలోని ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన ఈ సమీక్షాలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, ఎఫ్ఎల్ఎన్, ఎల్ఐపీ ప్రగతి, అధికారుల తనిఖీలు, స్పాట్ అసెస్మెంట్, పీఎంశ్రీ పనులు, మధ్యాహ్న భోజన నాణ్యత, భవిత కేంద్రాల పనితీరుపై ఆయన సమగ్ర సమీక్ష చేపట్టారు.

**-హాజరు 69 శాతమేనా**

జిల్లాలో ప్రస్తుతం విద్యార్థుల సగటు హాజరు కేవలం 69 శాతం మాత్రమే నమోదు కావడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడుల్లో హాజరు శాతం మరింత పెరగాల్సిన ఆవశ్యకత ఉందని నొక్కిచెప్పారు. 60 శాతం కంటే తక్కువ హాజరు నమోదైన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వెంటనే నోటీసులు జారీ చేసి, లిఖిత పూర్వక వివరణ కోరాలని ఆదేశించారు.

**-ఎఫ్ఆర్ఎస్ పాటించకుంటే ఇంక్రిమెంట్లు బంద్**

ఉపాధ్యాయులు సైతం సమయపాలన పాటించాల్సిందేనని తేల్చిచెప్పారు. నెలకు 15 రోజుల కంటే తక్కువ ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ హాజరు ఉన్న ఉపాధ్యాయుల నుంచి తక్షణమే వివరణ తీసుకోవాలని ఆదేశించారు. ఒకే ఉపాధ్యాయుడు వరుసగా మూడు నెలల పాటు ఇదే తీరును పునరావృతం చేస్తే, రెండు ఇంక్రిమెంట్లను నిలిపివేస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వచ్చే నెల నుంచి మండల స్థాయిలోనే కాకుండా, ఉపాధ్యాయుల వారీగా, అక్టోబర్ 1 నుండి జరిగే సమ్మేటివ్ పరీక్షల ఫలితాల మీద ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ హరి సింగ్, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ శ్రవణ్ కుమార్, క్వాలిటీ కో-ఆర్డినేటర్ హరికృష్ణ, జిల్లాలోని ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

## పీఎం శ్రీ పాఠశాలల జిల్లా స్థాయి పోటీలు విజయవంతం

భానుపురి/ సూర్యాపేట కలెక్టరేట్



జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పీఎం శ్రీ పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్, స్పెల్ బీ, మాక్ పార్లమెంట్ పోటీలను సూర్యాపేటలోని ఐడీఓసీ కలెక్టరే ట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రైనీ కలెక్టర్లు అనూషా, రవితేజ హాజరై విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. జిల్లా కోఆర్డినేటర్ హరికృష్ణ, ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రవణ్ కుమార్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. క్విజ్ పోటీలలో ఝాన్సీ లక్ష్మీబాయి గ్రూప్, రవీంద్రనాథ్ టాగోర్ గ్రూప్ విజేతలుగా నిలిచాయి. స్పెల్ బీ పోటీలలో జూనియర్ విభాగంలో సాత్విక్, పి. పవన్, జె. మేఘన బహుమతులు సాధించారు. సీనియర్ విభాగంలో సుహానా, మనోహర్, రహిత్య ప్రతిభ కనబరిచి బహుమతులు అందుకున్నారు. మాక్ పార్లమెంట్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, చర్చా నైపుణ్యాలు, సమయస్ఫూర్తి, సామాజిక అవగాహన పెంపొం దించేలా పోటీలు నిర్వహించారు. సోషల్ ఫోరం ఆధ్వర్యంలో వేముల సాయిదులు, కొప్పుల కిరణ్, నాగమణి, సుధార్షన్ రావు మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు సమిష్టిగా కృషి చేసి పోటీలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అధికారులు, నిర్వాహకులు, ఉపాధ్యాయులు విజేతలను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి

భానుపురి /హైదరాబాద్



నల్లగొండ--ఖమ్మం--వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఖరారైన రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం, పార్టీ కార్యక్రమాలు, గ్రాడ్యుయేట్ ఓటర్ల సమన్వయంపై చర్చించారు. తనను అభ్యర్థిగా ఎంపిక చేసిన పార్టీ అధిష్ఠానానికి, పీసీసీ అధ్యక్షుడికి సర్వోత్తమ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ఎన్నికల్లో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాంరెడ్డి కృష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ కొండపల్లి దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ నూతన కమిటీ సభ్యులకు సన్మానం

భానుపురి /సూర్యాపేట టౌన్

ఇటీవల సూర్యాపేట జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గా ఎన్నికైన బండారు రాజా,డైరెక్టర్ వెంపటి పురుషోత్తం లను సూర్యాపేట ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున బుధవారం ఘనంగా శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు మా శెట్టి అనంత రాములు జిల్లా అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సూర్యాపేట ఆర్యవైశ్య మిత్రులు తప్పీ గాంధీ కలకోట లక్ష్మయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూర్యాపేట ఆర్యవైశ్యులకు అజాత శత్రువుగా ఉంటూ, పార్టీలకు అతీతంగా, బండారు రాజా మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. సూర్యాపేట ఆర్యవైశ్యులకు ఏ ఆపద వచ్చిన నేనున్నానంటూ వారి సమస్యలు పరిష్కరించడానికి బండారు రాజా ఎంతో కృషి చేస్తారని తెలిపారు. లయన్స్ క్లబ్,



వాసవి క్లబ్, జిల్లా, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభల్లో ఎన్నో పదవులు అలంకరించి ఆ పదవులకే వన్నెతెచ్చారని కొనియాడారు. బండారు రాజా మునుముందు మరెన్నో పదవులు అలంకరించాలని పలువురు శుభాకాంక్షలు తెలిపారు. నిజాన్ని నిక్కచ్చిగా మాట్లాడే సమాజ సేవకులు ఆధ్యాత్మికపరులు వెంపటి పురుషోత్తం అని పలువురు కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమంలో సూర్యాపేట ఆర్యవైశ్యులు వెంపటి సురేష్, బొమ్మిడి లక్ష్మినారాయణ, పోతుగంటి వెంకటేశ్వర్లు, యమ ప్రభాకర్, బిక్కు మల్ల ఉపేందర్ , గుండా శ్రీధర్,కుక్కడపు శ్రీనివాస్, బ్రాహ్మణపల్లి సంతోష్ ,చల్లా సత్యనారాయణ, ఉప్పలంచు కృష్ణ, మహంకాళి ప్రణీత్, బెజగం ఫణి, పబ్బతి ప్రవీణ్, నవిలిపురి నరేందర్, తేరటపల్లి సతీష్, కొండ శ్రీనివాస్, వంగవీటి రమేష్ ,తప్పి అనిల్, బెలిదే శ్రీనివాస్, షీలా శంకర్, బెలిదే అశోక్, కొత్త వెంకటేశ్వర్లు, శ్రీరంగం రాము, యామా సంతోష్, తాటికొండ రంగారావు, గుండా కర్ణాకర్ ,బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## సఫాయి మిత్రుల భద్రతకు ప్రాధాన్యం

భానుపురి/ సూర్యాపేట టౌన్

స్వచ్ఛతా హి సేవా--2026 కార్యక్రమంలో భాగంగా సఫాయి మిత్ర సురక్షా ఏవం సమ్మాన్ శిబిరాన్ని బుధవారం సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుల భద్రత, గౌరవం, సంక్షేమానికి ప్రాధాన్యం కల్పిస్తూ వారికి రక్షణ పరికరాలను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ సి.హెచ్. హన్మంత రెడ్డి పారిశుద్ధ్య కార్మికులకు పీపీఈ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో కీలకమని అన్నారు. విధి నిర్వహణలో కార్మికుల భద్రత కోసం తప్పనిసరిగా రక్షణ పరికరాలను వినియోగించాలని సూచించారు. పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, గౌరవం, భద్రతకు మున్సిపాలిటీ తరపున అవసరమైన చర్యలు తీసుకుం టామని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజారోగ్యం, పారిశద్ధ్య పరి




రక్షణ కోసం అంకిత భావంతో పనిచేస్తున్న సఫాయి మిత్రుల సేవలన ఈ సందర్భంగా అభినందించారు.

## సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి

భానుపురి/ హైదరాబాద్



నల్లగొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల శాసనమండలి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించినందుకు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞ తలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డికి సీఎం అభినం దనలు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల నమోదు, ప్రచార కార్యక్రమాలపై అభ్యర్థులకు సీఎం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం

భానుపురి/సూర్యాపేట టౌన్



పోలీస్ ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు శ్రీ లక్ష్మి వెంకట సాయి పారా మెడికల్ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, వాహనాలు నడిపేటప్పుడు మొబైల్ ఫోన్ వినియోగించకపోవడం, మద్యం సేవించి వాహనాలు నడపకపోవడం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

# రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఎమ్మెల్సీ టికెట్ ఖరారు.. 47వ వార్డులో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

భానుపురి /సూర్యాపేట టౌన్



నల్లగొండ--ఖమ్మం--వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి పార్టీ అధిష్ఠానం ఖరారు చేసిన సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని 47వ వార్డులో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. బాణా సంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కుమ్మరికుంట్ల వేణుగోపాల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో నిరుద్యోగ యువత కోసం పలు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసిందన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్లు, ఉద్యోగులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి కి మద్దతుగా నిలిచి, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అలాగే 47వ వార్డు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు హెల్ప్ డెస్క్‌ను నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు వేణుగోపాల్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరుగా అర్హులైన గ్రాడ్యుయేట్లు తమ పేర్లను నమోదు చేసుకోవడానికి హెల్ప్ డెస్క్‌ను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ మాజీ కార్యదర్శులు రుద్రంగి రవి, అక్కేనపల్లి జానయ్య, జిల్లా కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్, చేనేత సహకార సంఘం డైరెక్టర్ యలగందుల సాయినేత, పట్టణ కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడు రావుల రాంబాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు నెల్లుట్ల లింగస్వామి, నరేందర్ నాయుడు, కుమ్మరికుంట్ల రాజు, గుణగంటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ ను సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నిరంతరం కొనసాగించాలి

భానుపురి/సూర్యాపేట టౌన్



తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఆర్ఎస్ విధానాన్ని నిరంతరం కొనసాగించాలని తెలంగాణ రియల్ ఎస్టేట్ వ్యాపార అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పంతంగి వీరస్వామి గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇటీవల ఎల్ఆర్ఎస్ ను సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. పాత పద్ధతిలోనే ఎల్ఆర్ఎస్ ను నిరంతరం కొనసాగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎకరం రెండు ఎకరాల లోపు ఉన్న భూములకు నాలా కన్వర్షన్ మీదనే ప్లాట్లకు నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేసేలా మార్గదర్శకాలు విడుదల చేయాలని పంతంగి వీరస్వామి గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. గతంలో ఎల్ ఆర్ ఎస్ కోసం 2020 సంవత్సరంలో పదివేల రూపాయలు చెల్లించిన వారికి రిజిస్ట్రేషన్ చేసుకునేలా అవకాశం కల్పించాలన్నారు. ప్రభుత్వం తెలంగాణ వ్యాప్తంగా పక్కాభవనాలు లేని చోట స్థలం నిధులు కేటాయించి అన్ని మౌలిక వసతులతో నూతన భవనాలు నిర్మించి అందుబాటులోకి తేవాలని అన్నారు. 22 ఏ నిషేధిత భూముల విషయంలో ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకొని ఆ సమస్యను పూర్తిగా పరిష్కరించాలని పంతంగి వీరస్వామి గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సూర్యాపేట జిల్లా రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు, జలగం సత్యం గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెన్నా శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి అమరవాది శ్రావణ్, రాష్ట్ర కార్యదర్శి కంభంపాటి అంజయ్యగౌడ్ గౌడ్, ఆకుల మారయ్య గౌడ్, అయితేగాని మల్లయ్య గౌడ్, రాపర్తి జానయ్య, విన్ను, నరేష్, పట్టేటి కిరణ్, మాదిరెడ్డి గోపాల్ రెడ్డి, సారగండ్ల కోటేష్, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

–మిర్యాలగూడలో ఘనంగా 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమం



భానుపురి/మిర్యాలగూడ:

మిర్యాలగూడ పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష నవీన్ కుమార్, మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతను విద్యార్థులు చిన్ననాటి నుంచే అలవర్చుకోవాలని సూచించారు. ఇల్లు, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి

భానుపురి /మిర్యాలగూడ



మిర్యాలగూడ పట్టణం 15వ వార్డులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డ్ కార్యక్రమాన్ని మునిసిపల్ కౌన్సిలర్ ఆర్కే శ్రీజా బుధవారం ప్రారంభించారు. అర్హులైన వారికి స్మార్ట్ రేషన్ కార్డును అందజేశారు. ఇంకా రానివారు ఎవరైనా ఉంటే వారికి త్వరలోనే స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తామని కౌన్సిలర్ శ్రీజ తెలిపారు. ప్రజలందరూ రేషన్ కార్డులు తీసుకుని సన్నబియ్యం పొందాలని 15వ వార్డు ప్రజలను విన్నవించారు.

# బుల్లెట్ ట్రైన్ సాధన కోసం కృషి చేసే వారికే ప్రజలు మద్దతు ఉంటుంది

భానుపురి /సూర్యాపేట టౌన్



జాతీయ రహదారి 65 కు సమాంతరంగా మొదటి అలైన్మెంట్ను కొనసాగించాలని కోరుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో చేస్తున్న బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ అభినందనలు తెలిపారు. కులమతాలకు అతీతంగా బుల్లెట్ ట్రైన్ సాధన కోసం వస్తున్న ప్రతి ఒక్కరిని అభినందించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ధర్నా చేయకు వద్ద 48వ రోజు మాలమహానాడు నాయకులు కూర్చున్న దీక్షకు ఆమె సంఘీభావం తెలిపి మాట్లాడారు. పోరాడితే ఏదైనా సాధించుకుంటామని తెలంగాణ రాష్ట్రాన్ని కూడా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అలాగే సాధించుకున్నామని ఆమె గుర్తు చేశారు. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి బుల్లెట్ ట్రైన్ సాధన బంధు కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు తెలిపారు. బుల్లెట్ ట్రైన్ విషయంలో ఎవరితో మాట్లాడానికైనా తాను సిద్ధమని జగదీశ్ రెడ్డి హామీ ఇవ్వడం హర్షనీయం అన్నారు. అలాగే అన్ని వర్గాల పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు బుల్లెట్ ట్రైన్ సాధన కోసం ముందుకు రావాలని ఎవరైతే బుల్లెట్ ట్రైన్ కు వ్యతిరేకంగా దూరంగా ఉన్నారు వారికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అటువంటి వారికి ప్రజల ముందుకు వచ్చి ఓటు అడిగే హక్కు లేదని ఆమె ఘాటుగా స్పందించారు. రాబోయే ఎన్నికలలో పోటీ చేయాలనుకుంటున్న ఎవరైనా పోటీ చేసే ముందు సూర్యాపేట ప్రజలకు ఏం కావాలో తెలుసుకోవాలని సూర్యాపేట జిల్లాలో ఏం జరుగుతుందో తెలుసుకొని ముందుకు రావాలని ఆమె అన్నారు. డబ్బులు దండుకోవడానికి ఫ్యూచర్ సిటీలను డెవలప్ చేసుకోవడానికి ఆస్తులు కాపాడుకోవడానికి ఆస్తులను అభివృద్ధి చేసుకోవడానికి అంటున్నారని ఆమె అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపిన బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కమిటీ సభ్యులు ఉద్యమాలను ఉధృతం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి మొదటి అలైన్మెంట్ ను కొనసాగించే విధంగా బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సూర్యాపేట ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ దీక్షలో కూర్చున్న వారు. సైతం మాట్లాడుతూ బుల్లెట్ ట్రైన్ సాధనే ధ్యేయంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ఉద్యమాలలో సూర్యాపేటకు సంబంధించిన అన్ని వర్గాల ప్రజలు కలిసి రావాలని బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ దీక్షలో కూర్చున్న వారుమాల మహానాడు జాతీయ అధ్యక్షులు తలమలహాసన్, అనుముల పూరి వినయ్, కామల్లరవి, వెంకట నరసయ్య, చందాదాస్, పెరుమళ్ళ రాజారావు, మద్దూరి కుమార్, వెంకన్న, గాజుల నరసయ్య, కట్ల మురళి, కట్ల సైదులు, వలమల్ల ప్రకాష్, కే మనోజ్, తదితరులు కూర్చోగా సంఘీ భావం తెలిపిన వారు బుల్లెట్ ట్రైన్ సాధన సమితి కమిటీ సభ్యులు పలు ప్రజాసంఘాల నాయకులు పెద్దిరెడ్డి రాజా, ధర్మార్జున్, చలమల్ల నరసింహ, వెలుగు వనిత, మట్టి పెల్లి సైదులు, బూర వెంకటేశ్వర్లు, భూపతి రాములు గౌడ్, కందుకూరి యాదగిరి, అడ్వకేట్ ఏడిన్ల అశోక్, డాక్టర్ రవి, భయ్యా మల్లి కార్జున్, యార్కచర్ల శోభారాణి, రవీందర్ నాయక్, బీరవెల్లి శ్రీనివాస్ రెడ్డి, బోయిళ్ళ అఖిల్ గంపల కృపాకర్ తదితరులు సంఘీభావం తెలిపారు.

# ఫోటో ట్రేడ్ ఎక్స్పో పోస్టర్ ఆవిష్కరణ

భానుపురి/తిరుమలగిరి



ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యం లో ఫోటో ట్రేడ్ ఎక్స్పోకు సంబంధించిన పోస్టర్‌ను తిరుమలగిరి మండల కేంద్రంలో ఆ యూని యన్, తిరుమలగిరి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఎల్సోజ్ నరేష్ ల తో కలిసి ఆవిష్కరించారు. బుధ వారం నాడు ఆవిష్కరించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ఫోటో, వీడియో గ్రఫీ రంగాల్లో తాజా సాంకేతికత, నూతన పరికరాలు, ప్రాక్టికల్ నైపుణ్యా లను ఒకే వేదికపై పరిచయం చేయాలనే లక్ష్యంతో ఈ ఎక్స్పోను నిర్వహిస్తున్నారని ఫోటో గ్రాఫర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. మండల కేంద్రం నుండి ప్రతి ఒక్క ఫోటోగ్రాఫర్ హాజరై మీ యొక్క నైపుణ్యతను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు ఫోటోగ్రఫీ రంగం దిన దిన అభివృద్ధితోపాటు ఏఐ టెక్నాలజీతో సరికొత్త హంగులతో ముందుకు పోతున్న తరుణంలో ఈ ఫోటో ఎక్స్పో ఫోటోగ్రాఫర్లకు చాలా అవసరం అని ఇలాంటి నైపుణ్యతతో కలిగిన ఫోటోగ్రాఫర్ ప్రాముఖ్యత మును ముందు ఎంతో ఉంటుందని ఈ అవకాశాన్ని మన మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు గుణగంటి సురేష్, పొదిల శ్రీనివాస్, సు లు గురు శ్రీనివాస్, రమేష్, శేఖర్, నగేష్, రాము, సందీప్, నిమ్మల యాదగిరి, సాయి, శ్రీధర్ రెడ్డి, రాజు ఫోటో, వీడియోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.




Contact :9848397377,9848436261,9000020234